నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
5 హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 SANGAREDDY



## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 8: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతిని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన కలెక్టర్‌ను ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కలిశారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

సంగారెడ్డి, జనవరి 8 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ, పురపాలకశాఖామాత్యులు తారక రామరావును బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి విభాగం నాయకులు ప్రజల పక్షాన పోరాటం చేయాలని కేటీఆర్ బీఆర్‌ఎస్‌వీ నాయకులకు కేటీఆర్ సూచించారు. మాజీమంత్రి కేటీఆర్‌ను కలిసిన వారిలో విద్యార్థి నాయకుడు రఘు ఉన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాల కమీషన్లు ఇవ్వండి

- కలెక్టర్‌కు విన్నవించిన డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

సంగారెడ్డి, జనవరి 8: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాలతో ధాన్యం సేకరించిన కొనుగోలు కేంద్రాలకు వెంటనే కమీషన్లు ఇవ్వాలని డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. సోమవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన కలెక్టర్ దృష్టికి కొనుగోలు నిర్వహించిన మహిళా సంఘాలు, ప్యాక్స్, డీసీఎంఎస్ కేంద్రాలకు రావాల్సిన కమీషన్లను వెంటనే ఇవ్వాలని కోరారు. గతేడాది 2022-23 వానకాలం, యాసంగి, ఈ ఏడాది వానకాలానికి చెందిన కొనుగోలు కేంద్రాలకు రావలిసిన కమీషన్లను గన్నీబ్యాగ్‌లు అప్పగించలేదనే సాకుతో సంబంధిత అధికారులు చెల్లించడంలేదని కలెక్టర్‌కు వివరించారు. ఆయా సంఘాలు చేసిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్లు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని వారిని ఆదుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన సంఘాలకు సకాలంలో కమీషన్లు ఇవ్వకపోవడంతో ఈసారి ధాన్యం సేకరణకు ముందుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకుని కమీషన్లు ఇప్పించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

## జాతీయ రహదారి విస్తరణ పనుల పరిశీలన

పటాన్‌చెరు, జనవరి 8: ఎన్‌హెచ్ 65వ జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జాతీయ రహదారుల అధికారుల బృందం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని జాతీయ రహదారిని పరిశీలించింది. అధికారులతో పాటు ఎమ్మెల్యే పటాన్‌చెరు బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించి జాతీయ రహదారి విస్తరణ ఎక్కడి వరకు ఉంటుందని తెలుసుకున్నారు. విస్తరణకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముత్తంగి గ్రామానికి యూటర్న్ లేకుండా చేశారని సర్పంచ్ ఉపేందర్‌ముదిరాజ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. న్యూటౌన్ కాలనీ వద్ద సర్వీసు రోడ్డు డివైడర్‌ను ట్రాఫిక్ విభాగం అధికారులు తొలిగించారని, దీంతో వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నాయని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సర్వీసు రోడ్లు గ్రామాల్లో, పట్టణాల్లో స్థానికులు తిరిగేందుకు తప్పకుండా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ ఈఈ ధర్మారెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

**పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం, జనవరి 8: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం భారతీ నగర్ డివిజన్‌లోని ఎల్ఐజీలో ఉన్న వార్డు కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు సంబంధించిన నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో పెన్షనర్ల సూచనలు కీలకమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు పరమేశ్, ఐలేశ్, సత్యనారాయణ, ప్రమోద్‌గౌడ్, పెన్షనర్ల సంఘం సభ్యులు వైకుంఠరావు, రామారావు, వెంకట్‌రెడ్డి, దేవేంద్రాచారి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ముత్తంగిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## కోమటికుంటలో అక్రమ కట్టడాలు కూల్చివేత


బొల్లారం, జనవరి 8: చెరువులు, కుంటలను మాయం చేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులపై రెవెన్యూ యంత్రాంగం రంగంలోకి దిగింది. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కోమటికుంట సర్వే నంబర్ 165లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న పలు కట్టడాలను సోమవారం తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, సర్వేయర్ రామభద్రంతో కలిసి జేసీబీతో నేలమట్టం చేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు చేయాలని చూస్తే కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ అక్రమార్కులను హెచ్చరించారు. కాగా 14 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన కోమటికుంట కబ్జాకు గురై, ప్రస్తుతం రెండు ఎకరాలకే పరిమితమైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు కుంట పరిరక్షణకు కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు.



అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

## ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

అమీన్‌పూర్/అందోల్/న్యాల్‌కల్/గుమ్మడిదల/కంగ్టి, జనవరి 8: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని లింగమయ్యకాలనీలో సోమవారం కౌన్సిలర్ చదువు మల్లేశ్ ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. భారీఎత్తున భక్తులు పాల్గొని శ్రీరామ నామంతో ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షింతలను సోమవారం అందోల్ మండలంలోని సంగుపేటలో పలువురు హిందూ సంఘాల నాయకులు ప్రజలకు పంపిణీ చేశారు. అక్షింతలకు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు.



అమీన్‌పూర్ : అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న కౌన్సిలర్ చదువు మల్లేశ్







జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, విద్యార్థులు ప్రదర్శిస్తున్న ఎగ్జిబిట్లు

# విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు
- జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో కలెక్టర్ వల్లూరు క్రాంతి



విద్యార్థుల ఎగ్జిబిట్లను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8: విద్యార్థులు పుస్తకాలను చదవడంతోపాటు వాటిలోని అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచన శక్తిని రేకెత్తిస్తాయన్నారు. విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటున్న క్రమంలో బట్టీ పద్ధతిని వీడాలని సూచించారు. పుస్తకాలు చదవడం, రాయడం మాత్రమే కాకుండా అందులోని విషయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తాను కూడా చిన్నతనంలో ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న సందర్భాన్ని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 761 ఎగ్జిబిట్లు నమోదు కాగా, ఆ సంఖ్య 800లకు పైగా దాటే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు వేలాదిమంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉన్నదని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు వినూత్న తరహాలో రూపొందించిన వివిధ ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. ఆయా ఎగ్జిబిట్లను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్, సెయింట్ ఆంథోనీస్ పాఠశాల కరెస్పాండెంట్ సలోమాన్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకట నర్సింహులు, వివిధ కమిటీల కన్వీనర్లు, విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు కొనసాగించాలి





జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

- అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి
- నల్లవాగు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి
- జిల్లాలో వైద్యసేవలు భేష్
- రాయినిచెరువులో ప్రహరీని తొలిగించాలి
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల వినతి

సంగారెడ్డి, జనవరి 8: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారు. కానీ ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ఇవ్వడంలో అధికార యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు విస్మరించారని జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశాన్ని జడ్పీసీఈవో ఎల్లయ్య ప్రారంభించారు.

సమావేశానికి కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరయ్యారు. ముందుగాఅభివృద్ధి, సంక్షేమంపై ప్రారంభమైన సమావేశంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. యాసంగి సాగుకు సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాలని సభ్యులు కలెక్టర్‌ను కోరారు. అలాగే నల్లవాగు ప్రాజెక్టు కింద ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు తైబందు చేయడమేంటని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు కింద 2వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు నీళ్లు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వైద్య విధాన పరిషత్‌లో ప్రజలకు సేవలు భేషుగ్గా ఉన్నాయని సభ్యులందరూ ముక్తకంఠంతో డీఎంఅండ్‌హెచ్‌వోపై ప్రశంసలు కురిపించారు. మన ఊరు-మనబడిలో పనులు పూర్తి చేసిన పాఠశాల యాజమాన్య కమిటీలకు నిధులు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జిల్లా పరిషత్ సహాయ సహకారాలు అందిస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా ప్రజా ప్రతినిధులు సమన్వయంలో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఐదేండ్లకోసారి ప్రజలు ఏ పార్టీకి అవకాశం ఇస్తే ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, పార్టీలు వేరైనా సమాజ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రైతులకు వెన్నెముకగా ఉన్న ట్రైయిడెంట్ చక్కెర కర్మాగారంలో 1.29 మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ చేశారని, అందులో యాజమాన్యం రైతులకు చెల్లించాల్సిన రూ. 7.35 కోట్లను వెంటనే విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో ప్రజలకు ప్రధానంగా విద్య, వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. గ్రామాల పరిశుభ్రత, మంచినీటి వసతి సౌకర్యంపై మండలస్థాయిలో అధికారులతో పర్యవేక్షిస్తామన్నారు.

జిల్లా అధికారులు పాఠశాలలను దత్తత తీసుకునే విధంగా చర్యలు చేపడతామన్నారు. రంజోల్ గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని ఘటనపై ఆర్డీవో విచారణ చేస్తున్నారని, నివేదికలు అందగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థిని మృతిపై విచారణ

జహీరాబాద్, జనవరి 8 : రంజోల్ సాంఘిక, సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న స్వప్న (17) ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందడంపై అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం సాంఘిక సంక్షేమ గురుకులల ఆర్‌సీవో విద్యార్థిని మృతిపై విచారణ చేశారు. విద్యార్థిని ఎందుకు ఆత్మహత్య చేసుకుంది.. కళాశాలలో ఉపాధ్యాయులు ఎవరైనా వేధింపులకు గురిచేశారా.. విద్యార్థిని గదిలోకి వెళ్లిన సమయంలో తోటి విద్యార్థినులు ఎవరైన చూశారా.. అని ప్రశ్నించిన్నట్లు సమాచారం. విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారన్నారు. పోలీసులు సైతం విద్యార్థిని మృతిపై పలు కోణల్లో విచారణ ప్రారంభించారని తెలిసింది. కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు తూంకుంట గ్రామంలో కూడా విచారణ చేస్తున్నారని తెలిసింది.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

జహీరాబాద్, జనవరి 8: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాల చైర్మన్ లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో స్పోర్ట్ మీట్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, ఖోఖో, 50 మీటర్ల రన్నింగ్ రేస్, స్కిప్పింగ్ క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, పీఈటీలు నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు పంటరుణాలు ఇవ్వాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8: రైతులకు ఎంతమేర పంట రుణాలు ఇవ్వగలిగితే వారికి లాభదాయకంగా ఉంటుందో ఆ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీసీసీబీ ఆధ్వర్యంలో బ్యాంకర్లు, అధికారులు రైతులతో జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎంతమేర పంట రుణాలు ఇవ్వగలిగితే వారికి లాభదాయకంగా ఉంటుందో ఆ మేరకు జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ నిర్ణయిస్తూ, సంబంధిత ప్రతిపాదనలు రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ ఆమోదానికి పంపాలని సూచించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ 2024-25 సంవత్సరంలో ఏ పంటకు ఎంత పంట రుణం ఇవ్వాలనే అంశంపై బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు, రైతులు చర్చించి నిర్ణయించారని, సంబంధిత ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదం కోసం పంపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల ఎల్‌డీఎంలు, డీసీసీబీ సీఈవో శ్రీనివాస్, నాబార్డ్ ఏజీఎం కృష్ణతేజ, మూడు జిల్లాల వ్యవసాయ శాఖ, ఉద్యాన, పట్టు, మత్స్య, పశు సంవర్ధక శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు సన్మానం

సంగారెడ్డి, జనవరి 8 : నూతన కలెక్టర్ వల్లూరు క్రాంతిని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతాప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు సన్మానించారు. సోమవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన కలెక్టర్‌ను సమావేశం అనంతరం శాలువాకప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపాలని కోరారు.

## కాలనీల అభివృద్ధే లక్ష్యం

అమీన్‌పూర్, జనవరి 8: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఆర్టీసీకాలనీలో రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో నిర్మించనున్న యూజీడీ నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్ మహాదేవరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నర్సింహగౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు రాములు, వీఫర్‌యూ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8: ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేయాలని అదనపు కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాధుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాధులను అందజేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజావాణిలో మొత్తం 72 అర్జీలు అందగా, అందులో 30 రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, మిగతా 42 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించినవన్నారు. ఆయా దరఖాస్తులను స్వీకరించిన అదనపు కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరా రు. కార్యక్రమంలో డీఆర్వో నగేశ్, ఏవో పరమేశ్, అధికారులు పాల్గొన్నారు.

## వీరభద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సిర్గాపూర్, జనవరి 8: సిర్గాపూర్‌లోని అతి పురాతనమైన వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కొద్దిరోజుల క్రితం కొత్తగా మండప నిర్మాణం అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామపెద్దలు కల్యాణ్‌రావుపాటీల్, మాజీ సర్పంచ్ మనీశ్‌పాటీల్, గ్రామస్తులు ఉన్నారు.

# సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలి

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఇతర అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8 : నిర్దిష్ట గడువులోగా సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారితో కలిసి సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎంఆర్ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరిపించి, నిర్దేశించిన కోటా మేరకు ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు చేరవేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. గత డిసెంబర్ 31 నాటికే ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కోటాను చేరవేయాల్సి ఉన్నప్పటికీ, అనేక జిల్లాల్లో మిల్లింగ్ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నదన్నారు. ఈనెల 21 వరకు ఎఫ్‌సీఐ గడువు పొడిగించినందున, నిర్ణీత సమయంలోగా కస్టం మిల్లింగ్ రైస్ నిల్వలు చేరేలా చూడాలన్నారు. రైస్ మిల్లులవారీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం 80 నుంచి 90శాతానికి పైగా మిల్లింగ్ నిర్వహించేలా చూడాలన్నారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్‌ను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ అభయహస్తం దరఖాస్తులను సకాలంలో అప్లోడ్ చేయాలన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో 3,83,979 దరఖాస్తులు అందాయని, వాటిలో ఇప్పటికే లక్షకు పైగా ఆన్‌లైన్ చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్‌వో వనజాత, డీపీవో సురేశ్‌మోహన్, డీఆర్వో నగేశ్, సివిల్ సప్లయిస్ డీఎం సుగుణబాయి పాల్గొన్నారు.

## సింగూరు నీటి విడుదల

పుల్కల్, జనవరి 8: సింగూరు ఆయకట్టు కింద పంటల సాగు కోసం నీటి పారుదల శాఖ అధికారులు సింగూరు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు యాసంగి సాగుకు నీటిని విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ ఈఈ మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ డీఈ నాగరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా వానకాలం, యాసంగి పంటలకు సింగూరు నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషంగా పంటలు పండించుకుంటున్నారని చెప్పారు. సింగూరు ఆయకట్టు కింద 40 వేల ఎకరాలు సాగు చేస్తున్నారని, అందు కోసం 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఈఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.